క్లుప్తంగా

వాటర్ లీకేజీలకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): వాటర్ వర్క్స్ అధికారులు స్పందించారు. గద్దె వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డులో తాగునీటి లీకేజీలకు వాటర్‌వర్క్స్ సిబ్బంది సోమవారం మరమ్మతులు ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే గద్దె వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డు, పసుపుతోట వీవీ నరసరాజు రోడ్డులో తాగునీటి లీకేజీల వల్ల స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి ఆదివారం లీకేజీలను సరిచేయరూ... శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. గద్దె వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డులో విద్యుత్ స్థంభం పక్కనే లీకేజీ ఉండడంతో మరమ్మతుల సమయంలో స్థంభం కూలిపోయే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్థంభంను మార్చాలని ఏఈ శివారెడ్డిని కోరారు.

సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీపీ సత్తిబాబు



నారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్‌శాఖలో విశిష్ట సేవలకుగాను ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు సేవా, ఉత్తమ సేవా పతకాలు పొందారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్‌ను టీకే రాణాను ఆయన కార్యాలయంలో మోకా సత్తిబాబు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.

పోరంకి యూనియన్ బ్యాంక్‌లో విజిలెన్స్ అవగాహన



మధురానగర్(విజయవాడసెంట్రల్): పోరంకి యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీరాం నందకృష్ణ పొదుపు లక్ష్మీ గ్రూపు సభ్యులకు సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. అలాగే అవినీతి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. బ్యాంక్ కల్పిస్తున్న వివిధ డిపాజిట్స్, రుణాలు, ప్రభుత్వ పథకాలు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై గురించి కూలంకుషంగా తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ యపురెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బ్రాంచ్ స్టాఫ్, క్లస్టర్ కో–ఆర్డినేటర్ ఝాన్సీ, దాస్ పాల్గొన్నారు.

డివైడర్‌లో చెత్తచెదారం, పిచ్చి మొక్కలు తొలగింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): భానునగర్ మసీదు సమీపంలోని డివైడర్‌లో చెత్తచెదారం, పిచ్చి మొక్కలను నగరపాలకసంస్థ పారిశుధ్య సిబ్బంది సోమవారం తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాడైన చెట్లను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు వేసి డివైడర్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూ దీపక్ స్టోర్స్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో గత 30 సంవత్సరాలుగా కస్టమర్ల అభిమానం చూరగొన్న ఏకైక క్లాత్ స్టోర్ న్యూ దీపక్ స్టోర్స్ అని ప్రొ. అశోక్ కుమార్ అన్నారు. లెనిన్‌సెంటర్ విజయడెయిరీ పార్లర్ సమీపంలోని న్యూ దీపక్ స్టోర్స్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఈ రంగంలో 30 సంవత్సరాలుగా ఉన్నామని తెలిపారు. క్వాలిటీలో అగ్రగామిగా ఉన్నామని, కస్టమర్లకు సేవలందించడంలో అందరికన్నా ముందున్నామన్నారు. కస్టమర్లకు నూతన వెరైటీలు అందించడంలో ఎప్పుడూ తామే ముందుంటామని పేర్కొన్నారు. రేమాండ్, అరవింద్, లెనిన్‌క్లబ్, బుర్గోయస్, మౌంటి మొదలగు బ్రాండ్లలో రకరకాల క్లాత్ మెటీరియల్స్ అందుబాటులో ఉంచామన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోందని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధి ప్రజాశక్తి నగర్‌లోని కమ్యూనిటీహాలులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం జరిగింది. వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రత్యేక వైద్యాధికారులతో ఉచితంగా వైద్య సేవలను అందజేస్తున్నారని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 18853 మంది అవుట్ పేషంట్లు వైద్య చికిత్సలు పొందారని, 35346 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా 68610 మందికి ఉచితంగా మందులు అందజేశారని, ఈసీజీ 1980 మందికి చేసి, ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రులకు 345 మందిని పంపడం జరిగిందన్నారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్య సేవలను అందించడం గొప్ప విషయమని చెప్పారు. ప్రతీ వ్యక్తి తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 74వేల మందికి ఆరోగ్యశ్రీ కార్డులున్నాయని, ఇంకా ఎవరైన ఆరోగ్య సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావచ్చునని వెల్లడించారు. జగనన్న ప్రభుత్వం పేదలకు సేవలు చేసే ప్రభుత్వమని, టిడిపి డబ్బులు వున్న వారికి మాత్రమే సేవ చేసేదన్నారు. ప్రజలందరూ జగనన్న సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, షేక్ ఇస్మాయిల్, డాక్టర్లు పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ కమ్యూనిటీ హాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదనే మహోన్నత ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో...

30వ డివిజన్ రామకృష్ణాపురంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీ జానారెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ప్రారంభించారు. నాడు-నేడు పథకం ద్వారా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన ప్రజలు

పేదల జీవితాల్లో నూతన వెలుగులు



అంబేద్కర్ కాలనీలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రజా సంకల్ప యాత్ర ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో నూతన వెలుగులు నింపారని ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 31వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి సోమవారం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయతకు నిలువుటద్దం సీఎం జగన్ అని కొనియాడారు. ప్రజా సంకల్పయాత్ర ద్వారా ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకుని వాటికి అనుగుణంగా నవరత్నాలు రూపొందించారని ఆయన తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స సత్యం, సుందర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో....

30వ డివిజన్ రామకృష్ణాపురంలో కార్పొరేటర్ బీ జానారెడ్డి ఆధ్వర్యాన ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్ళు పూర్తయ్యిన సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

61వ డివిజన్‌లో...

పాయకాపురం(విజయవాడరూరల్): జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటితో ఆరు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా 61వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు సోమవారం జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 61వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బల్లం కిషోర్, కొమ్ము రామకృష్ణ, ఎర్రంశెట్టి శ్రీనివాస్, రాజ, అన్నపురెడ్డి రా మిరెడ్డి, పురమా శ్రీధర్, కోటా పవన్‌కుమార్, మార్కపూడి కోటి, కాకర్ల చంద్రశేఖర్, రాజశేఖర్, దానం దుర్గారావు, భరద్వాజ్, ఎం.దాసు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నాడు ప్రతిపక్ష నాయకుడిగా జగనన్న తలపెట్టిన ప్రజా సంకల్పయాత్ర నేడు పేదల తలరాతను మార్చిందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ఆరేళ్ళు పూర్తైన సందర్భంగా విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ఎమ్మెల్సీ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీ రుహుల్లా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా హఫీజుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో...

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం 62వ డివిజన్లో వేడుకలు జరిగాయి. నగర వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్ ఆధ్వర్యంలో మోహనరావు హోటల్ సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూ టీ మేయర్ అవుతు శ్రీశైలజా, డివిజన్ కోఆర్డినేటర్ కె.వీరబాబు, రామిరెడ్డి, మహేష్, హైమావతి, గ్రేస్సీ, సావిత్రి, యోహాన్, బుజ్జి, సుభాని పాల్గొన్నారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జననేత వైఎస్ జగన్ 'ప్రజా సంకల్ప పాదయాత్ర' ప్రారంభించి ఆరేళ్ళు పూర్తైన సందర్భంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధిగా ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కమ్మిలి రత్నకుమార్, గుడ్డేటి అనిల్, సామంతపూడి చిన్నా, స్వామి, రాజేష్, కోటి, ఆలీ, దుర్గాప్రసాద్, దుర్గారావు, సిహెచ్.రమేష్ తదితరులు పాల్గొన్నారు

పోలీసు స్పందనలో 84 ఫిర్యాదులు స్వీకరణ



పోలీసు స్పందనలో బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న డీసీపీ వెంకటరత్నం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపీ పి.వెంకటరత్నం సోమవారం కార్యాలయంలో పోలీసు స్పందన నిర్వహించారు. బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 25 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 12, సివిల్ వివాదాలపై 15, వివిధ మోసాలపై 10, ఈవ్ టీజింగ్‌పై 1, త్వరితగతిన పరిష్కరించాల్సిన కేసులపై 3, ఇతర చిన్న చిన్న వివాదాలు, సమస్యలు, సంఘటనలకు సంబంధించినవి 18 ఫిర్యాదులు స్వీకరించారు.

బస్సు ప్రమాదంపై మంత్రి జోగి రమేష్ దిగ్భ్రాంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగిన బస్సు ప్రమాదం ఘటనపై రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగటం చాలా దురదృష్టకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, వారికి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఘటనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన బరోసా ఇచ్చారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని, విచారణ అనంతరం ప్రమాదానికి కారణమైన వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



ప్రభుత్వాస్పత్రి వద్ద బస్సు ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ బస్టాండ్‌లో ప్రమాదవశాత్తు బస్సు ఢీకొని మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులను కలిసి ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు పరిహారం ప్రకటించారని తెలిపారు. ఘటనపై విచారణ జరుగుతోందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు సీఎం ప్రకటించారని ఎమ్మెల్యే విష్ణు పేర్కొన్నారు.

అద్భుతంగా సాగిన మాండలిన్ మాస్ట్రో యూ రాజేష్ కచేరి

విజయవాడ కల్చరల్: ఒక పక్క మృదంగ విద్వాంసుడు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు లయ విన్యాసం, మరో పక్క కేవీ కృష్ణ వయోలిన్ వీటికి వంతపాడుతూ అంతర్జాతీయ ఘట విద్వాంసుడు సహకారంతో అద్భుతమైన రసస్పష్టికి సంగీత కళాశాల వేదికైంది. శ్రీ సద్గురు సంగీత సభ 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు మూడవరోజుకు చేరుకున్నాయి. మాండలిన్ మాస్ట్రో యూ రాజేష్ మూడు గంటలపాటు నిర్వహించిన కచేరి ఆద్యంతం సంగీత వైభవాన్ని చాటింది. కార్యక్రమాలను ప్రారంభించిన శ్రీసద్గురు సంగీతసభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ తెలుగు వారైన యూ శ్రీనివాస్ పాలకొల్లులో జన్మించి కర్నాటక సంగీత వైభవాన్ని ప్రపంచానికి తన మాండలిన్‌తో చాటిచెప్పారన్నారు.

15 నుంచి హోం గార్డెన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రోజ్ సొసైటీ సభ్యులు

పటమట(విజయవాడతూర్పు): రోజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు హోంగార్డెన్ కాంపిటీషన్స్, జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో హార్టికల్చర్ షో నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహన్‌రావు తెలిపారు. ఫన్ టైం క్లబ్ వెనక సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరాల్లో పెరిగిపోయిన కాలుష్యాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ ఇంట్లో తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు హోం గార్డెన్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు నాలుగు కేటగిరీలలో జరుగుతుందని పేర్కొన్నారు. చిన్నా – పెద్ద తోటలు, పండ్లు, కూరగాయ మొక్కలు, టెర్రస్ గార్డెన్లు పెంచే ఔత్సాహిక మొక్కల ప్రేమికులు పాల్గొనవచ్చన్నారు. సొసైటీ కార్యదర్శి పద్మప్రియ మాట్లాడుతూ జనవరి 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే హార్టికల్చరల్ షోలో అనేక జిల్లాల నుంచి మొక్కల ప్రేమికులు, నర్సరీల నిర్వాహకులు పాల్గొంటున్నారని వెల్లడించారు. మొక్కల ప్రదర్శనతో పాటు అమ్మకాలు కూడా ఉంటాయని వివరించారు. మొక్కలకు సంబంధించిన కుండీలు, ఎరువులు, ఆర్గానిక్ క్రిమిసంహారక మందులు తదితర స్టాల్స్ ను నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. కాంపిటీషన్లో పాల్గొనదలుచుకున్న వారు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోలని సూచించారు. అనంతరం సొసైటీ సభ్యులు హోం గార్డెన్ కాంపిటీషన్స్ బ్రోచర్ రిలీజ్ చేశారు. సొసైటీ సభ్యులు డాక్టర్ సీత మహాలక్ష్మి ఛాయాదేవి, ఉషారాణి, రత్నలక్ష్మి, ఎ.లక్ష్మి, విశాల, సుమబింధు, జ్యోత్స్న, రాఘవేంద్రరావు, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

19న ఛత్రపతి శివాజీ చారిత్రక నాటక ప్రదర్శన



ఛత్రపతి శివాజీ చారిత్రక నాటక ప్రదర్శన బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్, రచయిత కృష్ణ తదితరులు

విజయవాడ కల్చరల్: సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో 19వ తేది ఆదివారం తుమ్మపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జయహో ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సంచాలక్ కోనేరు దుర్గాప్రసాద్ తెలిపారు. సంస్కార భారతి ఆధ్వర్యాన అయోధ్యనగర్‌లోని హైందవి కార్యలయంలో విలేకరుల సమావేశం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ 350 జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా శివాజీ జీవితంలోని ముఖ్య ఘట్టాల ఆధారంగా చేసిన నాటకం తొలి ప్రదర్శన నగరంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రచయిత, దర్శకుడు పీవీఎస్ కృష్ణ, అతిథులు బ్రోచర్ ఆడియోను ఆవిష్కరించారు. సమావేశంలో సంస్కార భారతి ఏపీ ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ మహానగర్ సంఘ్ చాలక్ కృష్ణప్రసాద్, బీ పవన్‌కుమార్, సంస్కార భారతి సభ్యులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ కారిడార్ పనులు పరిశీలన



ఎయిర్‌పోర్టు కారిడార్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): గన్నవరం ఎయిర్‌పోర్టు కారిడార్ పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మెషిన్లతో పారిశుద్ధ నిర్వహణ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫుట్‌పాత్, డివైడర్‌కు ఇరువైపుల రోడ్డు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఏలూరు రోడ్డులో పారిశుధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించి ఫుట్‌పాత్‌లపై ఉన్న అనధికారిక ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సబ్ కలెక్టరేట్ సర్వీస్ స్టేషన్‌ను సందర్శించి వాహనాల డీజిల్ ఫిల్లింగ్ విధానాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందిని అడిగి ఫ్యూయల్ డిస్ట్రిబ్యూషన్ రికార్డును పరిశీలించారు. వాహనాలు ఏ సమయంలో డీజిల్ ఫిల్లింగ్ కోసం వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పారదర్శక పాలన



29వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా పారదర్శక పాలన అందిస్తున్నారని రాష్ట్రంలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమంను పరుగులు పెట్టిస్తున్నారని ఏపీ ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక మధురానగర్‌లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్ళి స్థానిక సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించారు.

రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం

సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పట్టిందని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. కోవిడ్ సమయంలో సైతం అభివృద్ధి సంక్షేమంను కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అందించామని గుర్తు చేశారు. అధికారంలో ఉండగా అభివృద్ధిని విస్మరించి అందినకాడికి దండుకోవటమే ధ్యేయంగా పనిచేసిన టీడీపీ నేతలకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. దోచుకోవటం, దాచుకోవటమే తెలిసిన పచ్చనేతలకు నగరంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం కనబడటం లేదా అని ప్రశ్నించారు.

మోడల్ కాలనీగా మధురానగర్

మధురానగర్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత తమకే దక్కుతుందని మల్లాది విష్ణు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. డిసెంబర్ నాటికి ఆర్‌యూబిని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, ఎస్‌కే బాబు, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన సమస్యలకు త్వరగా పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): నగరవాసుల నుంచి అధికారులు దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 23 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన ప్రత్యేక డివిజన్లలో నిరంతర పర్యవేక్షణ చేస్తుండాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సూచించారు. వీఎంసీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే 17 మందిని అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి కె.సురేష్ బాబు వారికి జైలు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

14న చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులకు చిత్రలేఖనంపై ఆసక్తి కలిగించడానికి బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14 తేదీ డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రమేష్ ఆసుపత్రి రోడ్డులోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు ఏలాంటి ప్రవేశ రుసుం లేదని, పాఠశాల, కళాశాల నుంచి ఎంతమంది విద్యార్థులు అయినా పాల్గొనవచ్చునని తెలిపారు. పోటీల్లో డ్రాయింగ్ షీట్ అందచేస్తామని, కలర్స్ విద్యార్థుల వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందచేస్తామని చెప్పారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు ఏదైనా అంశంపై బొమ్మలు గీయవచ్చునని, 6, 7వ తరగతుల వారికి ల్యాండ్‌స్కేప్ అనే అంశంపై, 8, 9, 10వ తరగతుల వారికి పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై, ఇంటర్ విద్యార్థులకు పిక్నిక్ అనే అంశం, డిగ్రీ విద్యార్థులు జాతీయ సమగ్రత అనే అంశంపై బొమ్మలు గీయాలని వివరించారు. పోటీలు జరిగే రోజు ఉదయం స్పా కళాశాల ఆవరణలో పేర్లు నమోదు చేసుకుంటామని తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందచేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 95029 44913 నంబరులో సంప్రదించాలని కోరారు.